# 5. సేంద్రియ సేద్యం

**నేపథ్యం:**

ఏప్రిల్ 28, 2014 నాడు కరీంనగర్ జిల్లాలోని ముస్తాబాద్‌లో నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా ద్వారా డా. పత్తిపాక మోహన్ సంచాలనంలో బడిపిల్లల కోసం కథారచన శిక్షణ శిబిరం (వర్క్ షాప్) జరిగింది. ఆ కార్యక్రమంలో సుమారు పద్నాలుగు గ్రామాల నుంచి వచ్చిన పాఠశాలల పిల్లలు పాల్గొన్నారు. ఆ పిల్లల నుండి సుమారు యాభై కథలు ఆ రోజు చేతికి వచ్చాయి. ఆ కథలలోని ఓ కథే ఈ క్రింది కథ. దీనిని ముస్తాబాద్‌లో 9వ తరగతి చదువుచున్న లోకం భానుప్రసాద్ అనే విద్యార్థి రచించాడు.



అనగనగా ఒక గ్రామంలో రామయ్య, గంగయ్య అనే ఇద్దరు వ్యక్తులు ఉండేవారు. వీరిలో రామయ్యకు రెండు ఎకరాల భూమి ఉండేది. తన ఇంటి వద్ద ఒక గుంత తవ్వి దానిలో పండ్లు, కూరగాయల తొక్కలు, భూమిలో కలిసే ఇతర పదార్థాలు ఆ గుంతలో వేసేవాడు రామయ్య.

అలా వేయడం ద్వారా ఆరు నెలల తరువాత అది కుళ్ళి, కంపోస్టు ఎరువుగా మారింది. దానిని పొలంలో చల్లాడు. అలా చల్లిన తరువాత వరిపొలం వేశాడు. ఈ కంపోస్టు వేసిన తరువాతే పంట దిగుబడి ఎక్కువగా వచ్చింది.

అతని పక్కనున్న గంగయ్య ఇది చూసి ఇతని పొలం ఇంత బాగా పండింది వీడు ఏమని మాయ చేశాడు?'' అడుగుదాం అని వచ్చి అడిగాడు. అప్పుడు రామయ్య ''నీ వరిపొలం కూడా అలా కావాలంటే నీవు మీ ఇంటి పక్క స్థలంలో ఒక గుంత తవ్వి, ఆ గుంతలో రోజూ మీ ఇంట్లో కోసి పడేసిన కూరగాయల తొక్కలు గాని, మట్టిలో కలిసిపోయే ఇతర చెత్తా చెదారం ఏమి ఉన్నా ఆ గుంతలో వేసి మూడు నెలల తరువాత మీ పొలంలో దాన్ని చల్లడం మొదలు పెట్టు'' అన్నాడు.

అప్పటి నుండి రామయ్య చెప్పిన మాటల్ని గంగయ్య విని ఒక సంవత్సరం అలా చేసి చూశాడు. చూస్తే గంగయ్య పంట కూడా అధిక మొత్తంలో పెరిగి అతనికి పంట దిగుబడి ఎక్కువ వచ్చింది.

అలా వారిద్దరిని చూసి చుట్టు పక్కల వాళ్ళు అందరూ అలానే చేశారు. దీంతో ఊళ్ళో వాళ్ళంతా అలాగే చేయడం మొదలు పెట్టారు.

అలాగే రామయ్య ఆ రైతులందరికి మరో విషయం తెలియజేశారు. మన పంట చేనుపై గనుక కీటకాలువంటి ఇతర పురుగులు కనిపిస్తే క్రిమిసంహారక మందులు వాడనవసరం లేదు. పొలం మధ్యలో కట్టెలు వంటివి గనుక పాతినట్లయితే, ఆ కొయ్యలపైన కొంగలు, పిచ్చుకలు వచ్చి కూర్చొని పురుగులను తినేస్తాయి. అలాగే రైతులకు, పంటకు లాభం కలిగేలా చేస్తాయి. ఒకవేళ కృత్రిమ మందులు కనుక వాడితే ఏ రోగం వస్తుందో తెలియదు.''

ఈ విషయాలన్ని రామయ్య చెప్పినట్లే ఊళ్ళోవాళ్ళు పాటించారు. ఇక వారు కొన్ని రోజుల తరువాత ఆస్తిపరులు అయ్యారు. ఆ ఊరు మొదట పల్లెటూరుగ ఉండేది. క్రమంగా పెద్ద గ్రామంగా మారింది.

## I. వినండి–సంభాషించండి.

1. వివిధ రకాల ఆధునిక వ్యవసాయపద్ధతులను పేర్కొనండి.
2. పంట దిగుబడి బాగా రావడానికి మనమేమి చేయవలెనో చర్చించండి.
3. కీటకములు, పురుగుల బారినుండి పంటలను ఎలా రక్షించుకొనవలెనో చెప్పండి.

## II. చదవండి–ఆలోచించండి–రాయండి.

**పదజాలం పెంపొందించుకుందాం.**

గుంత = గొయ్యి, గుంట; అధికం = ఎక్కువ; క్రిమిసంహారక = పురుగులను చంపు; ఆస్తిపరులు = డబ్బుగలవారు.

## III. కృత్యం:

**పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.**

అ. అల్లిక

రామయ్య గుంత తవ్వి అందులో వేసినవి

పుట సంఖ్య 34– లోని "అనగనగా ఒక ..... నుండి .... మొదలు పెట్టారు"... వరకు.

ఆ. వ్యతిరేక పదాలు రాయండి.

1. ఎగుబడి X ______ 2. ఎక్కువ X ______
3. చివర X ______ 4. అధికము X ______




ఇ. స్వీయస్పందన:

రామయ్య తన పొలంలో పంట బాగా దిగుబడి రావడానికి చేసిన ప్రయత్నాన్ని మీ సొంతమాటల్లో రాయండి.

## IV. వినండి–చర్చించండి–రాయండి.

**అ. జవాబు రాయండి.**

1. గంగయ్య ఏమని ఆలోచించాడు?
2. రామయ్య తన ఇంటి వద్ద ఎరువును ఏ విధంగా తయారు చేశాడు?
3. రామయ్య, గంగయ్యకు ఇచ్చిన సలహా ఏమిటి?
4. రామయ్య ఊళ్ళో రైతులకు తెలియ చేసిన విషయాలు ఏమిటి?

**ఆ. ఎవరు ఎవరితో పలికిరి.**

1. "మరో మూడు నెలల తరువాత మీ పొలంలో దాన్ని చల్లడం మొదలు పెట్టు". ______ → ______
2. మన పొలాలకు క్రిమి సంహారక మందులు వాడనవసరం లేదు. ______ → ______

**ఇ. అల్లిక**

రైతులు పంటలకు లాభం కలిగేందుకు రామయ్య చెప్పిన విషయాలు.

## V. స్వీయస్పందన

1. నీవు రైతువైతే పంట ఎక్కువగా రావడానికి ఏమేమి చేస్తావు?
2. మీ ఊరికి వెళ్లినపుడు ఎవరైనా ఒక రైతుని కలిసి ముఖాముఖి చర్చ జరుపుము.

## VI. భాషావగాహన

### అ. కాలాలను గుర్తించి రాయండి.

1. మూడు నెలల తరువాత మీ పొలంలోదాన్ని చల్లడం మొదలు పెట్టు.
2. రామయ్య రైతులకు సలహా ఇస్తున్నాడు.
3. రామయ్య చెప్పినట్లే ఊళ్ళో వాళ్ళు పాటించారు.

### ఆ. గీతగీసిన పదాల భాషాభాగాలను రాయండి.

1. <u>గంగయ్య</u> పంట కూడా దిగుబడి ఎక్కువ <u>వచ్చింది</u>.
2. <u>అలాగే</u> రైతులకు లాభం కలిగేలా చేస్తాయి.
3. <u>తన</u> ఇంటివద్ద ఒక గుంతను తవ్వాడు.

### ఇ. సామాన్య, సంయుక్త వాక్యాలను గుర్తించుము.

1. రామయ్య గుంతలో కూరగాయలు, ఇతర పదార్థాలు వేసేవాడు.
2. గంగయ్య, తన పొలంలో కూడా ఎరువులు చల్లాడు.
3. పొలంలో కొయ్యలపైన కొంగలు, పిచ్చుకలు కూర్చుంటాయి.

### ఈ. వాచకాలు రాయండి.

1. రామయ్య = 2. కీటకాలు = 3. రైతు =

### ఉ. కింద గుర్తించబడిన ప్రత్యయాలు ఏ విభక్తులకు చెందినవో రాయండి.

1. ఎరువు<u>ను</u> పొలంలో చల్లాడు.
2. పిచ్చుకల <u>వలన</u> పొలంలో పురుగులు ఉండవు.

## VII. సృజనాత్మకత

1. ఒక చిన్న డబ్బాలో మట్టిపోసి, ఏవేని విత్తనాలు, గింజలు జల్లి అవి ఎలా మొలకెత్తి మొక్కలుగా వస్తున్నాయో గమనించండి.
2. ఆహార పంటలు, వాణిజ్య పంటలు మొదలగు వాటిని గురించి అంతర్జాలం ద్వారా సమాచారం సేకరించండి.

## VIII. లేఖన నైపుణ్యాలు:

### ఆత్మకథ

"రైతు దేశానికి వెన్నెముక". కింది అంశాల ఆధారంగా రైతు ఆత్మకథ రాయండి.

**అంశాలు:**

నేను – రైతును – తెల్లవారు ఝామున – నాగలి – నా వృత్తి – ప్రవృత్తి – దుక్కి – విత్తులు జల్లటం – నారు – నీరు – ఎరువులు – పంట బలంగా – పంట కోసి – నూర్చి – ప్రజల ఆకలి – దేశానికి వెన్నెముక – జై కిసాన్ – స్ఫూర్తి.

**నేనివి నేర్చుకున్నా:**

- సేంద్రియ వ్యవసాయం.
- రైతు దేశానికి వెన్నెముక.

ఉ.సూ.: భారతదేశానికి వ్యవసాయము ముఖ్యమైన వృత్తి. వ్యవసాయము ఆధునిక పద్ధతుల ద్వారా ఎలా అభివృద్ధి చేయాలో విద్యార్థులకు తెలపండి.

వి.సూ.: 'రైతు దేశానికి వెన్నెముక' అనే విషయాన్ని గ్రంథ పఠనము ద్వారా తెలుసుకోండి.

IIE7HT